RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

సంపుటి - 01 సంచిక - 269 పేజీలు - 04 వెల - 05/- ఎడిటర్ : సి యం శ్రీనివాస్ గురువారం 30 మే 2024

# మే 31న చంద్రబాబు పవన్ భేటీ..!



**ఆంధ్ర ప్రగతి అమరావతి మే 29:** ఏపీలో ఫలితాలకు ఇంకొన్ని రోజులు మాత్రమే సమయం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ నెల 31న టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ భేటీ కాబోతున్నారు. ఇద్దరు నేతలు పోలింగ్ జరిగిన తీరు, ఆ తర్వాత జరిగిన పరిణామాలపై రివ్యూ చేసే అవకాశాలు ఉన్నాయ్.31న బీజేపీ నేతలు కూడా చంద్రబాబుని కలిసే అవకాశం ఉంది. ఏపీలో గెలుపు ఎవరిది అనే దానిపై క్లారిటీ రావడం లేదు. ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయనే టెన్షన్ కనిపిస్తోంది. ఎవరి అంచనాలు వారివి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తుందని కొందరు అంటుంటే.. వైసీపీ వరుసగా రెండోసారి అధికారం చేపట్టబోతుందని ఇంకొందరి వాదన. మరోవైపు రెండు పార్టీల నేతలు.. సీఎం ప్రమాణ స్వీకారం తేదీలను ప్రకటిస్తున్నారు.

జగన్ జూన్9న విశాఖలో ప్రమాణస్వీకారం చేస్తారని వైసీపీ నేతలు ప్రకటనలు చేశారు. అమరావతిలో చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని టీడీపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎవరెన్ని ప్రకటనలు చేసినా సీఎంగా ప్రమాణం చేసేది ఒకరే.. ఆ ఒకరు ఎవరనే ఉత్కంఠ ఏపీ జనాల్లో కంటిన్యూ అవుతోంది. గెలుపు ఖాయం అని కూటమి నేతలు చెప్తున్నా.. వారిని ఓ విషయం మాత్రం కంగారు పెడుతోంది. పెరిగిన పోలింగ్ శాతం గ్రామీణ ప్రాంతంలో కావడం.. అందులోనూ మహిళల ఓటింగ్ ఎక్కువ జరగడంతో.. కూటమి నేతల్లో లోలోపల టెన్షన్ స్టార్ట్ అయినట్లు తెలుస్తోంది.దీనిపై ఇద్దరి భేటీలో చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఇక ఇప్పటికే నియోజకవర్గాలవారీగా పోలింగ్ సరళిపై ఆరా తీశారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి 69లక్షల మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆ ఓట్ బ్యాంక్ తమదేనని వైసీపీ క్లెయిమ్ చేసుకుంటోంది. ఐతే అదంతా ప్రభుత్వ వ్యతిరేక ఓటుగా టీడీపీ వాదిస్తోంది. పూర్తి స్థాయిలో మహిళా ఓట్ బ్యాంక్.. వైసీపీకి వెళ్లలేదని టీడీపీ నేతలు లెక్కలు వేస్తున్నారు. టీడీపీ కూటమి నేతలు ఇప్పటి వరకు గెలుపు పైన ధీమా వ్యక్తం చేయకపోవటం.. గెలిచే సీట్ల పైన అంచనాలు చెప్పకపోవటంపై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయ్. ఇలాంటి పరిస్థితుల మధ్య ఇద్దరి భేటీ మరింత ఆసక్తికరంగా మారింది.

## బ్యాంకు ఖాతాల్లోనే 'సామాజిక భద్రత' పింఛన్లు



ఆంధ్ర ప్రగతి అమరావతి మే 29:
ఏప్రిల్ లో గ్రామ, వార్డు సచివాలయాల్లో పింఛన్ పంపిణీ మే లో బ్యాంకు ఖాతాల్లో పింఛన్ల జమ చేస్తున్నట్లు తెలిపింది. జూన్ లోనూ బ్యాంకు ఖాతాల్లోనే పింఛన్లు జమ చేసేందుకు నిర్ణయించిన ఏపీ ప్రభుత్వందివ్యాంగులు, నడవలేని వారికి మాత్రం ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ.వృద్ధులకు అందిస్తున్న సామాజిక భద్రత పింఛన్లను ఈసారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అంతకుమునుపు ఏప్రిల్ 1న గ్రామ, వార్డు సచివాలయాల్లో పింఛన్ పంపిణీ నిర్వహించింది. మే నెలలో బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసింది. ఈసారి కూడా బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, దివ్యాంగులు, నడవలేని వారికి మాత్రం ఇంటివద్దే పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

## జూన్ 1 నుండి డ్రైవింగ్ లైసెన్స్ ఆధార్ కార్డులో మార్పులు.!

**ఆంధ్ర ప్రగతి అమరావతి మే 29:** జూన్ 1 నుంచి ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల విషయంలో పలు మార్పులు అమల్లోకి రాబోతున్నాయి. అవేంటో తెలుసుకుందాం.డ్రైవింగ్ లైసెన్స్ కొత్త రూల్స్ సాధారణంగా డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చే ముందు డ్రైవింగ్ టెస్టులను ఆర్టీవో కార్యాలయాల్లో చేస్తుంటారు. జూన్ 1 నుంచి ఆ అవసరం లేదు. ప్రైవేట్ డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ల నుంచి కూడా లైసెన్స్ తీసుకోవచ్చు.కాలుష్యాన్ని నియంత్రించేందుకు దాదాపు 900,000 వాహనాలను తొలగించనున్నారు. కార్లకు సంబంధించిన ఎమిషన్ రెగ్యులేషన్స్‌ను కఠినతరం చేయనున్నారు.లిమిట్‌ను దాటి అతివేగంగా వెళ్లే వాహనాలకు రూ.1000 నుంచి రూ.2000 వరకు జరిమానా విధిస్తారు.

మైనర్లు వాహనాలు నడుపుతూ దొరికితే రూ.25,000 జరిమానా కట్టాల్సి ఉంటుంది. ఆ కారు రిజిస్ట్రేషన్ కార్డు క్యాన్సిల్ అవుతుంది. పట్టుబడిన మైనర్‌కు 25 ఏళ్లు వచ్చే వరకు లైసెన్స్ రాదు.ఆధార్ కార్డులో వివరాలు అప్డేట్ చేసుకునేందుకు జూన్ 14 వరకు సమయం ఉంది.





జూన్ 14 తర్వాత ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో అప్డేట్ చేసుకుంటే రూ.50 రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

మే 31లోపు ఆధార్ కార్డు ప్యాన్ కార్డు లింక్ చేయకపోతే పన్ను కట్టేవారికి అధిక టీడీఎస్ పడుతుందని ఐటీ శాఖ హెచ్చరించింది.ఎల్పిజి సిలిండర్ స్కీంలో కొత్త మార్పులుప్రతి నెల ఒకటో తేదీన ఎల్పిజి సిలిండర్ ధరల్లో సడలింపు ఉంటుంది.జూన్ 1 నుంచి చమురు కంపెనీలు గ్యాస్ సిలిండర్లపై ధరలను నిర్ణయిస్తాయి. ధరలు స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది.

## ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాబోతుంది.

ఆంధ్ర ప్రగతి అమరావతి మే 29:
ఏపీలో ఈసారి జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తర్వాత ఫలితాలపై ఉత్కంఠ కొనసాగుతోంది. రెండు రోజుల్లో చివరి విడత లోక్ సభ ఎన్నికల పోలింగ్ పూర్తి కాగానే ఎగ్జిట్ పోల్స్ కోసం అంతా ఎదురుచూస్తున్నారు.జూన్ 4న వెలువడే ఫలితాల్లో ఎవరు గెలవబోతున్నారనే ఉత్కంఠ అంతకంతకూ పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో కేంద్రానికి సైతం ఏపీలో ఎన్నికల ఫలితాలపై పలు రిపోర్టులు అందాయన్న ప్రచారం జరుగుతోంది. ఇదే క్రమంలో హోంమంత్రి అమిత్ షా తాజాగా మరోసారి ఏపీలో ఏం జరిగిందో చెప్పేశారు.తాజాగా జాతీయ మీడియా సంస్థ ఎన్డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో దేశవ్యాప్తంగా జరుగుతున్న ఎన్నికల్లో బీజేపీ మరోసారి గెలవడం ఖాయమని అమిత్ షా తేల్చిచెప్పేశారు. ఈ ఇంటర్వ్యూలో ఒడిశా, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణపై మీ అంచనాలు ఏమిటని అడిగిన ప్రశ్నకు అమిత్ షా సమాధానం ఇచ్చారు. ఒడిశాలో 17 లోక్ సభ సీట్లు, 75 అసెంబ్లీ సీట్లు టార్గెట్ పెట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణలో 10 సీట్లు గెలుస్తామన్నారు.



అలాగే ఏపీలో తమ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందని, అలాగే భారీ మొత్తంలో లోక్ సభ సీట్లను కూడా గెల్చుకోబోతున్నట్లు అమిత్ షా తెలిపారు. ఉత్తర, పశ్చిమ భారతంలో ప్రబల శక్తిగా ఉన్న బీజేపీ.. ఈసారి తూర్పు, దక్షిణ భారతంలోనూ సత్తా చాటుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ఏపీలో టీడీపీ-జనసేనతో జట్టు కట్టింది. ఈ నేపథ్యంలో ఏపీలో విజయంతో పాటు గణనీయంగా లోక్ సభ సీట్లు సాధించడంపై బీజేపీ భారీ ఆశలు పెట్టుకుంది. ఇప్పటికే ఏపీలో కూటమి గెలుస్తోందని మోడీతో పాటు అమిత్ షా కూడా పలుమార్లు పేర్కొన్నారు. వీరి వ్యాఖ్యలో నిజమెంతో జూన్ 4న తేలిపోనుంది.

## కాక రేపుతున్న సజ్జల కామెంట్స్..!



ఆంధ్ర ప్రగతి తాడేపల్లి మే 29:
ఏపీ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం కౌంటింగ్ సమయంలో వైసీపీ పోలింగ్ ఏజెంట్లు జాగ్రత్తగా వ్యవహరించాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణా రెడ్డి అన్నారు.కౌంటింగ్ సందర్భంగా కార్యకర్తలు ఎలా రెచ్చిపోవాలో వైసీపీ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి బోధిస్తున్నారు. కౌంటింగ్ సందర్భంగా నో రూల్స్.. రెచ్చిపోండి అని ఆయన కార్యకర్తలను రెచ్చగొట్టారు. కౌంటింగ్ సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహం గురించి ఆయన కౌంటింగ్ ఏజెంట్ల సమావేశంలో మాట్లాడారు.''నో రూల్స్.. కౌంటింగ్ సెంటర్లలో ఏజెంట్లు తిరగబడండి. ఈసీని కూడా లెక్కచేయాల్సిన అవసరం లేదు. తిరగబడే ధైర్యం వున్న ఏజెంట్లనే సెలెక్ట్ చేయండి. ఈసీ చెప్పే రూల్స్.కి తలాడించే ఏజెంట్లను పెట్టొద్దు. తిరగబడి గొడవచేసే గట్టి ఏజెంట్లను కౌంటింగ్ సెంటర్లలో నియమించాలి. తెలుగుదేశం, జనసేన ఏజెంట్లను ఎదిరించేలా వైసీపీ ఏజెంట్లు ఉండాలి. ఆ పార్టీలను అసలు లెక్క చేయాల్సిన అవసరమే లేదు.కౌంటింగ్ సెంటర్లలో ఏం జరుగుతోందో ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తాం. మీ వెంట మేమున్నాం" అని సజ్జల పోలింగ్ ఏజెంట్లను రెచ్చగొట్టారు. ఇలా రెచ్చగొడుతున్న వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

# జూన్ 4న ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు పూర్తి

-రాత్రి 8%-%9 గంటల మధ్య అన్ని నియోజక వర్గాల తుది ఫలితాలను ప్రకటిస్తాం.
-సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ కు తెలిపిన సీఈఓ మీనా.

ఆంధ్ర ప్రగతి అమరావతి, మే 29: జూన్ నెల 4 న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ప్రధాన ఏర్పాట్లు అన్నీ పూర్తి చేయడం జరిగిందని సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ కు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా స్పష్టం చేశారు. బుధవారం న్యూ ఢిల్లీ నిర్వచన్ సదన్ నుండి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్రంలో ఓట్ల లెక్కింపు కు నియోజక వర్గాల నుంచి వారీగా చేస్తున్న ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఓట్ల లెక్కింపుకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని, సత్వరమే ఫలితాల ప్రకటనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం 175 శాసన సభా నియోజకవర్గాల్లో 111 నియోజక వర్గాల్లో 20 రౌండ్ల లోపు, 61 నియోజకవర్గాల్లో 21 నుండి 24 రౌండ్ల లోపు మిగిలిన మూడు నియోజకవర్గాల్లో 25 రౌండ్లకు పైబడి ఓట్ల లెక్కింపు కార్యక్రమం కొనసాగేలా ప్రణాళిక సిద్దం చేసుకోవడం జరిగిందన్నారు. 111 నియోజక వర్గాల్లో మద్యాహ్నం 2.00 గంటల్లోపు, 61 నియోజక వర్గాల్లో సాయంత్రం 4.00 గంటల్లోపు మరియు మిగిలిన 3 నియోజక వర్గాల్లో సాయంత్రం 6.00 గంటల్లోపు ఓట్ల లెక్కింపు పూర్తి అవుతుందనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తంచేశారు. పోస్టల్ బ్యాలెట్ ల లెక్కింపుకై టేబుళ్లను పెంచి సకాలంలో వాటి లెక్కింపును కూడా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఏది ఏమైనా రాత్రి 8%-%9 గంటల మధ్య అన్ని నియోజక వర్గాల తుది ఫలితాలు ప్రకటించే విధంగా ప్రణాళికా బద్దంగా చర్యలు తీసుకోవడం జరుగుతున్నదనే విషయాన్ని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల తదుపరి కొన్ని జిల్లాల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవడం ఎంతో దురదృష్టకరమని, ఓట్ల లెక్కింపు రోజు ఆయా జిల్లాలో ఎటు వంటి అవాంచనీయ సంఘటనలకు తావు లేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేయడం జరుగుచున్నదని, 144 సెక్షన్ అమలుతో పాటు సీనియర్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. పల్నాడు జిల్లాలో డిజీపీతో పాటు తాను స్వయంగా పర్యటించి అక్కడి పరిస్థితులను పరిశీలించడం జరిగిందని, అధికారులతో సమీక్షి నిర్వహించి వారిని అప్రమత్తం చేయడం జరిగిందని తెలిపారు.





మిగతా 2లో

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



## జూన్ 4 న రాష్ట్ర వ్యాప్తంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద
# 144 సెక్షన్ అమలుకు ఈసీ ఆదేశం.

**ఆంధ్ర ప్రగతి అమరావతి మే 29:**
దేశంలో సార్వత్రిక ఎన్నికలు ముగింపు దశకు చేరడంతో వచ్చే నెల 4 వ తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఈసీ ఏర్పాట్లు చేస్తోంది.
కౌంటింగ్ ఏర్పాట్లను న్యూ ఢిల్లీ నిర్వచన్ సదన్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ పర్యవేక్షించారు. ఎన్నికల సంఘం మార్గ దర్శకాలను పాటిస్తూ ఖచ్చితమైన ఫలితాలను వేగంగా ప్రకటించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ సూచించారు.
జూన్ 4 వ తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేసుకోవాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఆదేశించారు. ఎన్నికల ఫలితాల ప్రకటన విషయంలో ఏమాత్రం జాప్యం చేయొద్దని సూచించారు.జూన్ 4న ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. ఏపీలో కొన్ని చోట్ల ఎన్నికలకు సంబంధించిన హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 20 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలు కేటాయించామని, పికెట్లు ఏర్పాటు చేస్తున్నామని ఎన్నికల ప్రధాన అధికారి తెలిపారు.
సున్నితమైన కేంద్రాలను గుర్తించడంతో పాటు, సమస్యలు సృష్టిస్తున్నట్లు అనుమానిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎన్నికల ఫలితాల రోజు 'డ్రై డే'గా అమలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మద్యం అందుబాటులో ఉండదని సీఈఓ మీనా స్పష్టం చేశారు.ఓట్ల లెక్కింపు రోజు ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్ల వద్ద క్రౌడ్ మేనేజ్మెంట్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నిర్ణీత పాస్ లేకుండా ఎవరినీ అనుమతించవద్దని సూచించారు. కౌంటింగ్ కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పవర్ బ్యాక్అప్, ఫైర్ సేఫ్టీ పరికరాలను సిద్దంగా ఉంచుకోవాలని, అత్యవసర ఆరోగ్య సేవలు అందజేసేందుకు అంబులెన్సులను కూడా సిద్దంగా ఉంచుకోవాలన్నారు.ఈవీఎంలలో పోల్ అయిన ఓట్ల లెక్కింపుకు సంబందించి ఎన్నికల అధికారులు, సిబ్బందికి ముందస్తుగానే శిక్షణ నివ్వాలని, సుశిక్షితులైన ఎన్నికల సిబ్బందితో పాటు కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్ వంటి ఐ.టి. పరికాలను ముందస్తుగా ఓట్ల లెక్కింపు కేంద్రాల సిద్దంగా ఉంచుకోవాలన్నారు.కౌంటింగ్ రోజు లెక్కించే ఈవీఎంలను ఎడాపెడా పడేయకుండా ఒక క్రమ పద్ధతిలో తీసుకురావడం, ఓట్ల లెక్కింపు పూర్తి అయిన తదుపరి "లెక్కింపు పూర్తి అయినట్లుగా" ఆయా ఈవీఎం లపై మార్కుచేస్తూ వెంటనే వాటిని సీల్ చేసి ఒక క్రమపద్ధతిలో సురక్షితంగా భద్రపర్చాలని సూచించారు. అనవసరంగా ఈవీఎం లను అటూ ఇటూ తరలించొద్దని, ఎలక్ట్రానిక్ ట్రాన్స్ఫర్ పోస్టల్ బ్యాలెట్ మేనేజ్మెంట్ సిస్టమ్ ను చక్కగా నిర్వహించాలని, వాటి లెక్కింపుకు సంబందించి ప్రత్యేకంగా టేబుళ్లను, స్కానర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎన్నికల ఫలితాలను ప్రకటించే విషయంలో ఏమాత్రము ఆలశ్యం చేయవద్దని, డిస్ప్లే బోర్డుల ద్వారా ఎప్పటి కప్పుడు ఖచ్చితమైన ఎన్నికల ఫలితాలను ప్రకటించాలని సూచించారు.



## జూన్ 4న ఓట్ల లెక్కింపుకు
# అన్ని ఏర్పాట్లు పూర్తి

*(మొదటి పేజి తరువాయి)*

రాష్ట్రంలోని ప్రాంతాల వారీగా పలు జిల్లాలో తాను పర్యటిస్తూ ఓట్ల లెక్కింపుకు, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించడం జరుగుచున్నదన్నారు.
రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంపై స్టేట్ పోలీస్ నోడల్ ఆఫీసర్, అడిషనల్ డీజీ ఎస్. బాగ్చీ మాట్లాడుతూ జూన్ 4 న జరుగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో ఎటు వంటి అవాంచనీయ సంఘటనలకు తావు లేకుండా తగు చర్యలు తీసుకునే విధంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలను, సీపీ లను అప్రమత్తం చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రణాళికా బద్దంగా చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు.ఈ సమీక్షా సమావేశంలో సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సమర్ధవంతమైన సీఈఓ ముఖేష్ కుమార్ మీనా ఉన్నారని, ఆయన నేతృత్వంలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని అన్ని నియోజక వర్గాల ఆర్వోలు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు, సీపీలకు సూచించారు. ఓట్ల లెక్కింపు రోజు ఎటువంటి జాప్యానికి అవకాశం లేకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఫలితాల ప్రకటనలో ఎటువంటి జాప్యం లేకుండా త్వరిత గతిన కచ్చితమైన ఫలితాలను ప్రకటించాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి అయిన వెంటనే పీసీ, ఏసీ ఫలితాల ప్రకటనకు సంబంధించిన ఫారం-21 సి మరియు 21ఇ లను అదే రోజు ఫ్లైట్ లో ఈసీఐ కి పంపాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు సమయంలో అభ్యర్థులు, ఏజెంట్లు ఎటువంటి అవాంతరాలు కలిగించ కుండా ఉండేందుకై ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన మార్గ దర్శకాలపై వారికి పూర్తి స్థాయిలో ముందుగానే అవగాహన కల్పించాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో, స్ట్రాంగ్ రూమ్లలో కూలీల సేవలను వినియోగించుకునే అంశంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులను ఎవ్వరినీ అందుకు వినియోగించ వద్దన్నారు. గుర్తింపు కార్డులు ఉన్నవారినే ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి, అనుమతించాలన్నారు. ఎన్నికల తదుపరి పలనాడు జిల్లాలో పలు హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయని, ఈ జిల్లాలోని అధికారులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని, ఓట్ల లెక్కింపు రోజు ఎటువంటి దుర్ఘటనలు తావు లేకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాటు, త్వరితగతిన ఖచ్చితమైన ఫలితాల ప్రకటనకు అనుసరిస్తున్న ప్రణాళిక బద్ధమైన చర్యలు, శాంతి భద్రతల పరిరక్షణకు నియోజకవర్గాల వారీగా చేస్తున్న బందో బస్తు ఏర్పాట్లను ఆయా నియోజక వర్గాల ఆర్వోలు, జిల్లా ఎన్నికల అధికారులు, పోలీస్ సూపరింటెండెంట్ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ కు వివరించారు.రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా, స్టేట్ పోలీస్ నోడల్ ఆఫీసర్, అడిషనల్ డీజీ ఎస్. బాగ్చీ , అదనపు సీఈఓఎమ్ ఎన్ హరేంధిర ప్రసాద్ రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుండి పాల్గొనగా, రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల ఆర్వోలు జిల్లా ఎన్నికల అధికారులు మరియు పోలీస్ కమిషనర్లు ఎస్పీలు వారి నియోజకవర్గాల నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

---

# జగన్ ప్లాన్ 'బి' వర్కౌట్ అవుతుందా..?



ఆంధ్ర ప్రగతి అమరావతి మే 29:
'ఎట్టి పరిస్థితుల్లోనూ అధికాంలోకి వస్తాం..' అని అంటోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. 150 ప్లస్ సీట్లతో ఇంకోసారి అదికారం చేపడతామని ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, తన కోసం గత కొన్నేళ్ళుగా పని చేస్తున్న ఐ-ప్యాక్ టీమ్తో ఎన్నికల తర్వాత మాట్లాడుతూ వ్యాఖ్యానించారు.ఎలాగోలా.. ఎట్టి పరిస్థితుల్లో.. అన్న మాటలు వైసీపీ నుంచి వస్తున్నాయంటే, వై నాట్ 175 లేదు.. వంకాయ్ కూడా లేదన్నమాట.! కానీ, వైసీపీ దగ్గర ప్లాన్-బి వుందట. వైసీపీ వర్గాల్లో నడుస్తున్న చర్చ ఇది. డెబ్బయ్ సీట్లకు అటూ ఇటూగా వైసీపీకి వస్తాయని ఆ పార్టీలో అంతర్గతంగా చర్చ జరుగుతోంది.ఈ క్రమంలోనే ఇతర పార్టీల్లో బలహీనమైన నాయకుల్ని ప్రసన్నం చేసుకుని, ఎలాగోలా అధికార పీఠమెక్కెయ్యాలన్నది వైసీపీ 'ప్లాన్-బి' అట. ఈ 'ప్లాన్-బి' కోసం అవసరమైతే జనసేన మద్దతుని కూడా వైసీపీ తీసుకుంటుందా.? అన్నదానిపై వైసీపీలో భిన్న వాదనలున్నాయి.వైసీపీలో ఈ చర్చ జరగడంలో వింతేమీ లేదు. కానీ, వైసీపీకి జనసేన మద్దతిచ్చే పరిస్థితే లేదు. కాకపోతే, టీడీపీలో ఒకరిద్దరు నేతలేమైనా వైసీపీ వైపు ఎన్నికల తర్వాత చూస్తారా.? అన్నది అప్పటి ఈక్వేషన్ని బట్టి వుంటుంది.అయితే, ఏ రాజకీయ పార్టీకి ఆ రాజకీయ పార్టీ ఎప్పుడూ ప్లాన్-బి అనేదాంతో సిద్దంగా వుంటుంది. వైసీపీ కూడా, అదే విధంగా 'ప్లాన్-బి'ని రెడీ చేసుకుందిట. మ్యాజిక్ మార్క్ అంటే 88 సీట్లు, ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీకి సంబంధించి. అంటే, దానికి దగ్గరగా.. చాలా దగ్గరగా వైసీపీ వెళితే, ఇతర పార్టీల నుంచి గెలిచే శాసన సభ్యుల అవసరం వుంటుంది.వైసీపీలో చర్చ జరుగుతున్నట్లు 70 - 80 మధ్యలో అయితే, వైసీపీకి అసలు ఆ ఛాన్స్ వుండదు. మరీ అంత లేదు.. 50 దాటడం కూడా వైసీపీకి కష్టమేనన్నది తాజా అంచనా.


# జూన్ మూడో తేదిన పార్టీ నేతలతో పవన్ కల్యాణ్ భేటి

**ఆంధ్ర ప్రగతి అమరావతి మే 29:**
ఎపిలో జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు జూన్ నాలుగో తేదిన జరగనున్న నేపథ్యంలో జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో జూన్ మూడో తేదిన భేటి కానున్నారు.. ఆ రోజున ఆయన మంగళగిరి వెళ్లనున్నారు.. కౌంటింగ్ ఏజెంట్లకు ఆయన దిశ నిర్దేశం చేయనున్నారు.. అలాగే కౌంటింగ్ రోజున మంగళగిరి పార్టీ కార్యాలయంలోనే ఉండి ఓటింగ్ సరళిని, పలితాలను పరిశీలించనున్నారు..



# చంద్రబాబు మౌనం వెనుక.. తుఫాను సంకేతమేనా..!

**ఆంధ్ర ప్రగతి అమరావతి మే 29:**
రాష్ట్రంలో ఎన్నికల పోలింగ్ ఈ నెల 13నే ముగిసింది. అంటే.. దాదాపు 15 రోజులు అయిపోయింది. కానీ, ఇప్పటి వరకు టీడీపీ అధినేత చంద్రబాబు ఒక్కసారి కూడా..తాము గెలుస్తున్నామని కానీ.. తమకు ఇన్ని సీట్లు వస్తున్నాయని కానీ.. ఎక్కడా కనీసం ప్రకటన చేయలేదు. క్షేత్రస్థాయిలో నాయకులు కూడా.. తర్జన భర్జన పడుతున్నారు. కొందరు పైకి చెబుతున్నా.. మరికొందరు చెప్పేందుకు కూడా జంకుతున్నారు. టీవీల చర్చా కార్యక్రమాల్లో పాల్గొంటున్నవారు కూడా.. రోజు రోజుకు ఫిగర్ మార్చేస్తున్నారు.
మరోవైపు.. వైసీపీ నుంచి స్పష్టమైన ప్రకటనలు వస్తున్నాయి. సీఎం జగన్ తాను లండన్కు వెళ్తూ.. రాష్ట్రంతో తామే వస్తున్నా మన్నారు. అంతేకాదు.. దేశం నివ్వెరపోయేలా ఫలితం వస్తుందని చెప్పారు. 151 సీట్ల పైమాటే తప్ప.. కిందికి తగ్గే పరిస్థితి కూడా లేదన్నారు. ఇక, దీనిని అందిపుచ్చుకున్న ఇతర నాయకులు కూడా.. జగన్ వాదననే వినిపించారు. ఒకరిద్దరు మాత్రం 130-125 మధ్య వస్తాయని చెబుతున్నారు. మొత్తంగా ఏదో ఒక అంకె నైతే చెబుతున్నారు.కానీ, ఈ పరిస్థితి మనకు టీడీపీలో కనిపించడం లేదు.చంద్రబాబు వంటి సీనియర్ మోస్ట్ నాయకుడు కానీ.. పవన్ కానీ.. బీజేపీ రాష్ట్ర చీఫ్ పురందేశ్వరి కానీ.. ఎక్కడా.. తమ పెరఫా ర్మెన్స్పై



పన్నెత్తు మాట కూడా మాట్లాడలేదు. నిజానికి దేశంలో ఆరు దశలో పోలింగ్ ముగిసిన తర్వాత.. బీజేపీ పెద్దలు కేంద్రంలో తాము అధికారంలోకి వస్తున్నట్టు చెప్పారు. తాజాగా ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ కేంద్ర మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా.. తాము ఏపీలోకూడా అధికారంలోకి (కూటమి) వస్తున్నామని చెప్పుకొచ్చారు. ఉత్తరాది నాయకులే ఇంత ధైర్యంగా చెబుతున్నప్పుడు.. ఏపీ నేతలు ఎందుకు మౌనంగా ఉన్నారనేది ప్రశ్న.(ఇక, చంద్రబాబు విషయానికి వస్తే..ఆయన మౌనానికి రెండు కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి.. 2019లో ఆయన చెప్పిన సమాచారం. అప్పట్లో రెండు దశల్లో ఏపీలో పోలింగ్ జరిగింది. రెండు దశల పోలింగ్ అనంతరం.. చంద్రబాబు వెంటనే మీడియా ముందుకు వచ్చారు. అప్పట్లో ఆయన సీఎం. ఇంకేముంది.. మేం గెలుస్తున్నామని.. మహిళలు.. క్యూలైన్లలో అర్ధరాత్రి వరకు నిలబడి ఓటేశారని.. ఇది తమకు పాజిటివ్ అని చెప్పారు.కానీ, పరాజయం పాలయ్యారు. దీంతో ఇప్పుడు ఆ కారణంగానే.. ఆయన మౌనంగా ఉన్నారని టీడీపీ సీనియర్లు వ్యాఖ్యానిస్తున్నారు.
మరోవైపు.. సీఎం జగన్ చెప్పినట్టు జూన్ 4న వచ్చే ఫలితంతో దేశం మొత్తం ఆశ్చర్య పోతుందని.. చంద్రబాబు కూడా నమ్ముతు న్నారు. కూటమి విజయంతో దేశమే ఏపీవైపు చూస్తుందని అనుకుంటున్నారు. అందుకే తినబోతూ రుచి చూడడం ఎందుకని ఆయన భావిస్తున్నారని.. అందుకే తుఫాను ముందటి ప్రశాంతతను ఆయన పాటిస్తున్నారని మరికొందరు చెబుతున్నారు. మొత్తంగా చూస్తే.. ఎవరి అంచనాలు వారికి ఉన్నాయి. మరి ఏం జరుగుతుంది? ఎవరు గెలుస్తారు? అనేది మాత్రం జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే.

# మళ్లీ అధికారంలోకి వస్తున్నాం..
## అందులో ఎలాంటి అనుమానం లేదు: సజ్జల

**ఆంధ్ర ప్రగతి అమరావతి మే 29:**
ఆంధ్రప్రదేశ్ లో మరోసారి అధికారంలోకి రాబోతున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్ సీపీ) ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు.బుధవారం తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ కౌంటింగ్ ఏజెంట్ల వర్క్ షాప్ లో ఆయన మాట్లాడారు. పార్టీ అధికారంలోకి వచ్చే విషయంలో ఎలాంటి అనుమానం లేదన్నారు. జూన్ 9న సీఎంగా మళ్లీ వైఎస్ జగన్ ప్రమాణస్వీకారం చేస్తారని పునరుద్ఘాటించారు.వారం రోజుల తర్వాత రాష్ట్రానికి టీడీపీ పీడ విరగడవుతుందని వ్యాఖ్యానించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు తమకే పడ్డాయని టీడీపీ నేతలు ప్రచారం చేసుకుంటున్నా తాము మాత్రం ఫలితాల ముందు తాత్కాలిక ఆనందాల జోలికి వెళ్లడం లేదని చెప్పారు.అయితే కౌంటింగ్ రోజు పార్టీ ఏజెంట్లంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియ జరిగేలా చూడాలని కోరారు. ప్రత్యర్థి పార్టీల ఏజెంట్ల ఆటలు సాగనివ్వరాదని పేర్కొన్నారు.



# ఓట్ల లెక్కింపు.... పకడ్బందీ ఏర్పాట్లు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 29:
జూన్ 4న నిర్వహించే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఫలితాల వెల్లడికి పకడ్బందీ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం పాణ్యం మండలం నెరవాడ గ్రామం సమీపంలోని ఆర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు అనుసంధానంగా కౌంటింగ్ కేంద్రాలలో చేస్తున్న ఏర్పాట్లను జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలిసిన మీడియా విలేకరులతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళిక రచన సిద్ధం చేసి ఆ మేరకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి నియోజకవర్గానికి అసెంబ్లీ సెగ్మెంట్ కు ఒక కౌంటింగ్ హాలు, పార్లమెంటు సెగ్మెంట్ కు ఒక కౌంటింగ్ హాల్ చొప్పున 12 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నంద్యాల పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రత్యేకంగా మరొక కౌంటింగ్ హాల్ ను కూడా సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి హాల్ కు 14 టేబుల్ చొప్పున... రౌండ్ల వారీగా అభ్యర్థులకు పోలైన ఓట్ల వివరాలను వెల్లడిస్తామన్నారు. ఈవీఎంల ఓట్ల లెక్కింపు కోసం అసెంబ్లీకి 74 టేబుళ్ళ, పార్లమెంటుకు 75 టేబుళ్లు.... పోస్టల్ ఓట్ల లెక్కింపు కోసం అసెంబ్లీకి 21 టేబుళ్లు, పార్లమెంటుకు 17 టేబుళ్ల చొప్పున ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని కలెక్టర్ వెల్లడించారు. ఓట్ల లెక్కింపు ఫలితాల వెల్లడి జూన్ 4వ తేదీ సాయంత్రం 5 నుండి 6 గంటల లోపల పూర్తవుతుందన్నారు. కౌంటింగ్ హాలులో ఓట్ల లెక్కింపు సజావుగా, సౌకర్యవంతంగా జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా వివిధ రాజకీయ పార్టీల ఏజెంట్లు కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశామన్నారు.

అన్ని స్ట్రాంగ్ రూములకు సిసి కెమెరాలతో కనెక్ట్ చేయబడి కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి వెబ్ కాస్టింగ్ ద్వారా 24/7 నిరంతరాయంగా పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ ఏజెంట్ల నియామకానికి సంబంధించి 75 శాతం పూర్తయిందన్నారు. కౌంటింగ్ నిర్వహణ తీరు, శాంతి భద్రతల పరిరక్షణ తదితర అంశాలపై రాజకీయ పార్టీలతో రెండుసార్లు సమావేశాలు నిర్వహించి భారత ఎన్నికల సంఘం విధి విధానాలపై వివరించామని కలెక్టర్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహణకు అందరూ సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు.

## ఇద్దరికీ వ్యక్తులకు, ఒక్కొక్కరికి
# 07 రోజులు జైలు శిక్ష
### -నంద్యాల 1 టౌన్ ఇన్స్పెక్టర్ వెంకటా చలపతి



ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 29:
నంద్యాల పట్టణంలోని 1 టౌన్ ఏరియా లో వివిధ బహిరంగ ప్రదేశాల్లో మధ్యము సేవించి ప్రజలకు అసౌకర్యం కల్గించుచున్న ఇద్దరు వ్యక్తులను నంద్యాల 1 టౌన్ ఇన్స్పెక్టర్ బి వి చలపతి గారు వారి సిబ్బందిచే అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసి కోర్టు నందు చార్జి షీట్ దాఖలు చేసి, గౌరవ నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ **R.** రామభూపాల్ రెడ్డి గారి ముందు హాజరుపరచగా సదరు గౌరవ జడ్జి గారు ముద్దాయిలకు ఒక్కొక్కరికి 07 రోజులు జైలు శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.

పట్టుబడిన వ్యక్తుల వివరాలు...

1. షేక్ ఖాసిం, వయస్సు- 42 సం//లు, **S/o** షేక్ రసూల్, **R/o** నడిగడ్డ స్ట్రీట్, నంద్యాల టౌన్.
2. షేక్ నూర్ బాష, వయస్సు- 40సం//లు **S/o** ఖాజా మోహిద్దీన్, **R/o** జగజ్జనని నగర్

## మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరు వ్యక్తులకు ఒక్కొక్కరికి 07 రోజులు జైలు శిక్ష.
### -నంద్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్ .




ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 29:
నంద్యాల పట్టణంలోని జగన్ ఆర్థోపెడిక్ హాస్పిటల్ దగ్గర నంద్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్ వారి సిబ్బందిచే డ్రంక్ అండ్ డ్రైవ్ చెకింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించి ఉండి రోడ్డుపైన వాహనాలు నడుపుతూ పట్టు పడగా సదరు వ్యక్తులను విచారించి స్వాధీనంలోనికి తీసుకొని కేసు నమోదు చేసి కోర్టు నందు చార్జి షీట్ దాఖలు చేసి, గౌరవ నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆర్. రామభూపాల్ రెడ్డి ముందు హాజరుపరచగా సదరు జడ్జి ముద్దాయిలకు ఒక్కొక్కరికి 07 జైలు శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.

**పట్టుబడిన వ్యక్తుల వివరాలు...**

1).మోత్కూరు మధు 34 స"**S/o** శివయ్యడానియల్ పురం, నంద్యాల టౌన్.
2).కొప్పెర చంద్రశేఖర్, 26స"**S/o** చిన్న బాల వెంకటకొత్తపల్లి గ్రామం, నంద్యాల మండలం.

## సలీం నగర్ లో డ్రైనేజీ నీరు రోడ్లపై పారుతుంటే
# పట్టించుకోని మున్సిపల్ అధికారులు



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 29:**
సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో సలీం నగర్ లో డ్రైనేజీ మురికి నీరు ప్రవహిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించడం జరిగిందని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ ఎఐటియుసి పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు సలీంనగర్ సిపిఐ శాఖ కార్యదర్శి భూమని శ్రీనివాసులు అజిత్ తెలిపారు. అనంతరం సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సచివాలయం ప్రక్కన డ్రైనేజీ లోని మురికి నీరు ఒక నెల నుండి రోడ్డుపై ప్రవహిస్తూ వాహనదారులకు పాదచారులకు అక్కడ నివసించే వారికి ఇబ్బందిగా ఉంటే ఏమాత్రం మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. కాలువలలో పూడికలు తీయకక దోమలు వృద్ధి చెంది ఆ ప్రాంత వాసులు కంటిమీద కునుకు లేకుండా ఉన్నారు. రోడ్డుపైకి వస్తున్న డ్రైనేజీ నీరు వాహనదారులు వెళ్లేటప్పుడు పాదచారులపై అక్కడ అంగళ్లపై పడడం జరుగుతుంది మున్సిపల్ అధికారులు పట్టణ ప్రజలపై వేలకు వేలు అన్ని రకాల పన్నులు విధిస్తూ భారాల మీద భారాలు వేస్తూ ఉంటారు. కానీ ఇటువంటి సమస్యలు ఏమాత్రం పట్టించుకోరు వెంటనే మున్సిపల్ అధికారులు కాలువలలో పూడికలు తీసి దోమల నివారణకు పాగింగ్ చేసి బ్లాక్ అయిన మోరిని రిపేరు చేసి సమస్యలను పరిష్కరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ సమితిగా డిమాండ్ చేస్తున్నాం.

## డాక్టర్ వీరం మురళీధరరెడ్డి కు ఎన్.టి.రామారావు జాతీయ పురస్కారం.




ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 29: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిని , తెలుగు భాషాభివృద్ధిని జగత్ విఖ్యాతి గావించిన శ్రీ ఎన్టీ రామారావు స్మారక జాతీయ అవార్డును 2024 సంవత్సరానికి డాక్టర్ వీరం మురళీధరరెడ్డి కి భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ చైర్మన్ కళా రత్న డాక్టర్ బిక్కి కృష్ణ,టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు , పొలిటికల్ కార్యదర్శి టిడి జనార్ధన్ మరియు నందమూరి మోహనకృష్ణ చేతుల మీదుగా ఇచ్చారు ఈ కార్యక్రమం హైదరాబాదులోనీ సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో జరిగినది. డాక్టర్ వీరం మురళీ ధరరెడ్డి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలు అంకితభావంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ , మైనార్టీల కోసం వారి అభివృద్ధి కోసం వికలాంగుల , మహిళల , బాలల సంక్షేమం కోసం పర్యావరణ పరిరక్షణ , నీటి సంరక్షణ , విద్యా , వైద్యాభివృద్ధి కోసం, వినియోగదారుల హక్కుల కోసం నిరంతర కృషి చేసినందుకు అవార్డును అందుకున్నారు.

## 50 సంవత్సరాల నుంచి ఉంటున్నాం ఖాళీ చేయమంటే ఎలా..?
### -మత్స్యకారులు ఆత్మకూరు డి.ఎఫ్.ఓ కార్యాలయంలో వినతి.



ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు మే 29:
ఆత్మకూరు డివిజన్ పరిధిలోని కొత్తపల్లి మండలం ముసలమడుగు గ్రామ సమీపంలోని అంకాలమ్మ కోట నది ఒడ్డున నివసిస్తున్న మత్స్యకారులకు అటవీ శాఖ అధికారులు అటవీ చట్టం 1967 ప్రకారం అటవీ ప్రాంతంలో నివాసం ఉండకూడదని, ఖాళీ చేయాలని నోటీసులు జారీ మత్స్యకారులు మాకు జీవనోపాధి కల్పించాలని, అంతవరకు మేము ఖాళీ చేయమని ఆత్మకూరు డి.ఎఫ్.ఓ కార్యాలయం చేరుకుని ఫారెస్ట్ రేంజ్ అధికారి పట్టాభికి వినతి పత్రం అందించారు.

## మున్సిపల్ కార్మికుల ఐక్యతే
# సమస్యల పరిష్కారానికి సరైన మార్గం.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 29:**




రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు ఐక్యతగా కలిసిమెలిసి ఉండడం ద్వారా రాబోయే ప్రభుత్వం పై పోరాటాలు చేసి సమస్యలను పరిష్కారం చేసుకోవచ్చని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక నంద్యాల పట్టణంలోని సిఐటియు జిల్లా కార్యాలయం నందు నంద్యాల జిల్లాలోని మున్సిపల్ వర్కర్ల జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి యూనియన్ జిల్లా నాయకులు భాస్కరాచారి అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, రాష్ట్ర నాయకులు విజయ్ కుమార్ లతో జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల నుండి నాయకులు,కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

అనంతరం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో అన్ని మున్సిపాలిటీలలోని కార్మికులంతా ఐక్యంగా ఉండాలని ఏ సమస్య వచ్చినా ఐక్యతతో ముందుకు పోతే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని, ప్రజలకు సేవ చేస్తున్న మున్సిపల్ కార్మికుల పట్ల ప్రభుత్వాలు సరైన రీతిలో స్పందించడం లేదని, సమస్యల పరిష్కారానికి నోచుకోవడం లేదని రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలలోని కార్మికులంతా ప్రభుత్వాలపైన తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, రాబోయే ప్రభుత్వం అయినా తమ సమస్యలను పరిష్కారం చేస్తుందని ఆశిస్తున్నారని అలా లేని పక్షంలో ప్రభుత్వాల పై పోరాటానికి సిద్ధం అయ్యేందుకు మున్సిపల్ కార్మికులంతా ఐక్యతగా ముందుకు కదలాలని ముఖ్యంగా కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, ఆప్కాస్ వద్దు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రతి మున్సిపల్ కార్మికుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని, అర్హులైన వారందరికీ ఇళ్ళు, ఇళ్ల స్థలాలను ఇచ్చి ఆదుకోవాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని అన్నారు.

# టీడీపీ కీలక నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్

**ఆంధ్ర ప్రగతి అమరావతి మే 29:**
ఏపీలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తర్వాత విశ్రాంతి కోసం విదేశాలకు వెళ్లిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తిరిగి వచ్చారు. రాష్ట్రంలో ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాలకు ఏర్పాట్లు సాగుతున్న నేపథ్యంలో తిరిగి వచ్చిన చంద్రబాబు.. బుధవారం పార్టీలోని కీలక నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో ప్రధానంగా కౌంటింగ్ డే ప్లాన్‌పై నేతలతో ఆయన చర్చించడం జరిగింది. ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల విషయంలో అధికార వైసీపీ మాటల యుద్ధం సాగిస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు నేతలు, కార్యకర్తలకు సూచించారు. కౌంటింగ్‌పై సీరియస్‌గా దృష్టిపెట్టాలని నేతల్ని చంద్రబాబు కోరారు. ఇందుకోసం శుక్రవారం 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ నియోజక వర్గాల చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లతో సమావేశం కావాలని ఆయన నిర్ణయించారు. అలాగే జూన్ 1న జోనల్ స్థాయిలో కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణ ఇవ్వబోతున్నారు. ఈ రెండు కార్యక్రమాలు చాలా కీలకమని చంద్రబాబు భావిస్తున్నారు. అంతేగాక పోస్టల్ బ్యాలెట్ విషయంలో నెలకొన్న భిన్నాభిప్రాయాలు, అంచనాల నేపథ్యంలో కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు నిబంధనలపై ఇప్పటికే వైసీపీ విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు విమర్శల్ని తిప్పికొట్టాలని నేతల్ని చంద్రబాబు ఆదేశించారు. వైసీపీ నేతలు ఓటమికి కారణాలు వెతుక్కుంటున్నారని చంద్రబాబు పేర్కొన్నారు. అందుకే ఈసీ, పోలీసులపై విమర్శలు చేస్తున్నారని గుర్తు చేశారు. అటు కౌంటింగ్ రోజు పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘాన్ని కోరాలని టీడీపీ నిర్ణయించింది. ఈ మేరకు ఈసీ, డీజీపీకి లేఖ రాయనున్నారు. రాష్ట్రంలో 175 సీట్లకు గానూ, 130 ఎన్నికల పరిశీలకులనే నియమించడం పట్ల చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం నుంచి ఉండవల్లి ఇంట్లోనే ఉంటూ కౌంటింగ్ ప్లాన్‌ను టీడీపీ అధినేత పర్యవేక్షించనున్నారని తెలుస్తోంది

# బాల కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించండి.

## -సంబంధిత అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 29:**
బాల కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించి జూన్ 30 నాటికి నంద్యాల జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా రూపొందించడానికి సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు ఆదేశించారు.

బుధవారం కలెక్టరేట్లోని ఆయన చాంబర్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ బాల కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించి వారి హక్కులను కాపాడుతూ జూన్ 30 నాటికి నంద్యాల జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా రూపొందించడానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జూన్ 1 నుండి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా బాల కార్మికుల నిర్మూలనపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి




ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బాలలను పనిలో పెట్టుకున్న యజమానులపై బాల కార్మిక నిర్మూలన చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి సంబంధిత జాబితాను కార్మిక శాఖ సహాయ కమిషనర్ అందజేసి తదుపరి చర్యలు గైకొనాలని డీఈఓను ఆదేశించారు. గుర్తించిన బాలల వయసు నిర్ధారణ చేసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని డియంహెచ్ఓ ను ఆదేశించారు. అర్హులైన పిల్లలకు సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశాలు కల్పించుటకు చర్యలు తీసుకోవాలని సంక్షేమ శాఖ డీడిని ఆదేశించారు. వీధి బాలలను గుర్తించి అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని స్త్రీ శిశు సంక్షేమ అధికారులను ఆదేశించారు.

జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ మొక్కుబడి రీతిలో కాకుండా బాల కార్మికుల ఖచ్చితమైన ప్రదేశాలను గుర్తించి సమాచారం ఇస్తే రెస్క్యూ బృందాలను పంపిస్తామన్నారు. బాల కార్మికుల సంక్షేమం కోసం జిల్లా టాస్క్ఫోర్స్ కమిటీ సభ్యులు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ సహాయ కమిషనర్ బషీరున్నిసాబేగం, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ, డీఈవో సుధాకర్ రెడ్డి, వరల్డ్ విజన్ ఇండియా, స్టార్ సొసైటీ, మదర్ సొసైటీ, బర్డ్స్ సొసైటీ తదితర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# మహానంది క్షేత్రంలో రా ...లీ..లలకు వన్ టైం సెటిల్మెంట్

**ఆంధ్ర ప్రగతి మహానంది మే 29:**
మహానంది క్షేత్రంలో రా... లీ..లలకు వన్ టైం సెటిల్మెంట్ చేసినట్లు విశ్వాసనీయ సమాచారం. ఆలస్యంగా అందిన విశ్వాసనీయ సమాచారం మేరకు గత కొన్ని రోజుల క్రితం క్షేత్రంలో పనిచేసే ఇద్దరు సన్నిహితంగా మెలుగుతూ రా.. లీ..లల్లో ఆలయ పరిధిలో మునిగి తేలుతున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా క్షేత్రంలోని కేశఖండన జరిగే ప్రాంతానికి సమీపంలో రా ...లీ..లలో ఆనందిస్తున్నట్లు తెలిసింది. దీనిని గమనించినట్లు భావిస్తున్న ఒకరిద్దరు ఆలయ అధికారులకు తెలియజేసినట్లు సమాచారం. దీనికంటే కొన్ని నెలల ముందుగా వీరి రా ..లీ..ల వ్యవహారం బయట పడినట్లు తెలిసింది. దీంతో ఒక ప్రజా ప్రతినిధితో పాటు పాలకమండలిలో ఒకరు ఒత్తిడి మేరకు మందలించి వదిలి వేసినట్లు సమాచారం. అనంతరం కూడా ఆలయ పరిధిలో తమ పని తాము చేసుకుంటూ ఒకరిద్దరి కంట పడినట్లు తెలుస్తుంది. ఆ నోట ఈ నోట పడి ఆలయ అధికారులకు చేరడంతో పోలీసుల దాకా వెళ్లకుండా రూ లక్ష వన్ టైం సెటిల్మెంట్ చేసినట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను ఆలయంలో పనిచేయకుండా తొలగించాలని



ఆలయ ప్రతిష్టకు భంగం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆలయ అధికారిపై ఉందని స్థానికుల నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రంలో ఉన్న సీసీ కెమెరాల కంట పడకుండా జాగ్రత్తలు తీసుకుంటూ రా ..లీ..లల్లో ఓ ప్రజా ప్రతినిధి అండతో పాటు మాజీ పాలకమండలి సభ్యుల్లో ఒకరు అండదండలతో నిరభ్యంతరంగా తమ పబ్బం క్షేత్ర పరిధిలో గడుపుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో కూడా ఇలాంటి వ్యవహారాలు ఆలయంలో పనిచేసే సిబ్బంది ఇద్దరు ముగ్గురు రా.. లీ.లల్లో గుట్టు చప్పుడు కాకుండా చిన్న కోనేరు ప్రాంతంలో ఉన్న కళ్యాణ మండపం పక్కన ఉన్న ప్రహరీ గోడ మధ్యలో వ్యవహారాలు చక్కదిద్దుకున్నట్లు సమాచారం.

# ఉపాధి హామీ పనికి కూలి వేతనం పెంచాలి

ఆంధ్ర ప్రగతి పగిడాల మే 29:
నంద్యాల జిల్లా పగిడాల మండలం సంక్రేణి పల్లె గ్రామంమహాత్మ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 200 రోజులు పని దినాలు 600 రూపాయల కూలివేతనంపెంచాలని సిపిఐ.ఏపీ రైతు సంఘం.జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బుధవారం నాడు ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సంకిరేణిపల్లె గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించడం జరిగింది .ఉపాధి కూలీలతో పనుల దగ్గర సమావేశం ఏర్పాటు చేసి నా సందర్భంగా టెక్నికల్ అసిస్టెంట్ .శ్రీకాంత్.ఫీల్డ్ అసిస్టెంట్ రవి కి సమస్యలతో కూడిన వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమానికి కాటేపోగు స్వామన్న అధ్యక్షత వహించగా రైతు సంఘం జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పగిడాల మండలంలో శంకరేనిపల్లె బీరవోలు ఆంజనేయ నగర్ప్రాతకోట ఎం గణపవరం ఎన్ గణపురం వనములపాడు ముచ్చుమర్రి నెహ్రూ నగర్తదితర గ్రామాలు శ్రీశైలం బ్యాక్ వాటర్ లో గ్రామాలు




మునిగిపోయి పొలం విస్తీర్ణం బ్యాక్ వాటర్ లో ఉందన్నారు. ఈ గ్రామాలకుఉపాధి కూలీలకు పనులు చూపడానికిచెరువులు కుంటలు రైతుల పొలాలు లేకపోవడంతో కూలీలకు అరకొరగా చేపడుతున్నారని ఫీల్డ్ అసిస్టెంట్లకు టెక్నికల్ అసిస్టెంట్లకు పనులు చూపెట్టడానికి పొలాలు లేకపోవడంతో ఉపాధి సిబ్బంది ఉపాధి కూలీలకు సమాధానం చెప్పుకోలేకపోతున్నారని అన్నారు. ఈ గ్రామాలకు బ్యాక్ వాటర్ లో రైతుల పొలాలు మిగిలి భూములుగా ఉన్నాయని ఈ భూములలో పంట కాలువలకు ప్రభుత్వం అనుమతులు ఇస్తే ఈ గ్రామాల కూలీలకు ఉపాధి అవకాశాలు పెరిగేఅవకాశం ఉందన్నారు.ప్రభుత్వం.గతంలో సమ్మర్ అలవెన్స్ 30 శాతం ఇచ్చేవారని ఉపాధి పనుల దగ్గర మజ్జిగ మంచినీరు ఏర్పాటు చేసేవారని ఎన్నికల కోడుతోఅధికారులు మంగళం పాడారన్నారు 300 రూపాయలు కూలి ఉండగా 150 .180లోపేరోజువారి కూలి వస్తుందని అందులో సమ్మర్ అలవెన్స్ కలిపితే 30% గిట్టుబాటు అవుతుంది అన్నారు. పెరిగే ధరలకు అనుగుణంగా కూలి వేతనాన్ని 600 రూపాయలు పెంచాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నామన్నారు. ఈ సమస్యల పట్ల జిల్లా కలెక్టర్ ఎన్ ఆర్ జి ఎస్ పిడి పెండింగ్లో ఉన్న ఉపాధి వేతనాలను పనుల మస్టర్లను తక్షణమే మంజూరు చేయాలని పగడాల మండలం కరువు మండలంగా ప్రకటించారని రెండు మాసాలు కావస్తున్న ఇంతవరకు కరువు అభివృద్ధి పనులు ఎక్కడ కనిపించడం లేదన్నారు ప్రతి జాబ్ కార్డు ఉన్న రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు ఆరు మాసాల పాటు కుటుంబానికి 50 కేజీల బియ్యం ఉచితంగా ఇవ్వాలని కరువు పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతు. వ్యవసాయకార్మిక సంఘం .ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పి వెంకటస్వామి కే బాలస్వామి కురుమన్న చంద్రశేఖర్ గౌడ్ ఆంజనేయులు బి మద్దిలేటి రామచంద్ర గౌడ్ డి రమణయ్యమహిళలు కే గోవిందమ్మ నాగలక్ష్మి ఎం సోమేశ్వరమ్మ ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా రెండు రోజా కొనసాగిన పూజా కార్యక్రమాలు

-లక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వాసాపుర వెంకటేశ్వరస్వామిల వారికి విశేష పూజలు.
-పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం, అల్పాహార ఏర్పాటు.

**ఆంధ్ర ప్రగతి రుద్రవరం, మే 29:**
నంద్యాల జిల్లాలోని రుద్రవరం మండల పరిధిలోని కొండమాయపల్లె గ్రామ పంచాయతీ, వెలగల పల్లె గ్రామ పొలిమేరలో వెలిసిన శ్రీ లక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వాసాపుర వెంకటేశ్వర స్వామి దేవస్థానం, మహా త్రిపుర సుందరీ సమేత మానస లింగేశ్వరస్వామి దేవస్థానములు ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు రెండో రోజూ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు వెల్లాల పుల్లయ్య, వారణిసి గోపీ శర్మ మరియు శివస్వామిలు, అధ్యక్షులు సింగతల మధుసూదన రెడ్డి, ఉపాధ్యక్షులు ఎల్.వి రంగనాయకులు, కోశాధికారి ఇ కె వి నరసింహులు, అన్నదాత ఎం ఓబులయ్య ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా పూజా




కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం 6గంటలకు మంగళధ్వని, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, యజమాన సంకల్పము, ఉదయము 7గంటలకు స్వామి వారికి పంచామృత అభిషేకం, నీరాజనం, ఉదయము 9 గంటలకు మహాశాంతి హెూమము, పూర్ణాహుతి, ఉదయము 10 గంటలకు స్వామి వారికి విశేషార్చన, ఉదయం 11 గంటలకు తీర్థ ప్రసాద వినియోగం, నీరాజనం మధ్యాహ్నము 12 గంటలకు శ్రీమాన్ డాక్టర్ దీవిహయగ్రీవాచార్యుల వారిచే మధ్యాహ్నము ఒంటి గంటకు శ్రీవేంకటేశ్వర వైభవం - ప్రవచన కార్యక్రమం చేపట్టారు. అలాగే బాల భవన్ నంద్యాల నాట్య గురువులు శ్రీ నరసింహులు గారి శిష్య బృందం చే శాస్త్రీయ నృత్య ప్రదర్శన మరియు కోలాట కార్యక్రమాలు చేపట్టారు.శ్రీలక్ష్మీ గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక శాంతి కళ్యాణము, నీరాజనం, యజమానులకు ఆశీర్వచనము -తీర్థప్రసాద గోష్ఠి శ్రీలక్ష్మీ గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు. వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.వచ్చిన భక్తులకు ఉదయం, మధ్యాహ్నం అల్పాహారం, భోజన సౌకర్యాలు కల్పించినట్లు అన్నారు. భక్తులు, గ్రామస్థుల సహకారంతో వార్షి కోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయని అన్నారు.

# హత్యాయత్నం కేసులో టీటీడీ డిప్యూటీ ఈఈ శ్రీలక్ష్మి అరెస్ట్

**తిరుపతి ఆంధ్ర ప్రగతి మే 29:**
తిరుపతిలో హత్యాయత్నం కేసులో టీటీడీ డిప్యూటీ ఈఈ శ్రీలక్ష్మిని పోలీసులు అరెస్ట్ చేశారు. శివారెడ్డిపై హత్యాయత్నం కేసులో తిరుపతిలోని ఎన్జీవో కాలనీ నుంచి శ్రీలక్ష్మితో పాటు భర్త చంద్రారెడ్డిని అలిపిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఎన్జీవో కాలనీలో నివాసం ఉంటున్న శివారెడ్డి ఫ్లాట్ ఎదురుగానే శ్రీలక్ష్మి దంపతులు నివాసం ఉంటున్నారు. అయితే శ్రీలక్ష్మి దంపతులకు అప్పు ఇచ్చిన వారికి... శివారెడ్డి తన అడ్రస్ చెబుతున్నారు. దీంతో వారు శివారెడ్డిపై కక్ష పెంచుకున్నారు.గతంలో శివారెడ్డి, శ్రీలక్ష్మి దంపతుల మధ్య వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత తమకు అప్పు ఇచ్చిన వారికి అడ్రస్ చెప్పడాన్ని శ్రీలక్ష్మి దంపతులు జీర్ణించుకోలేకపోయారు. శివారెడ్డిని అడ్డు తొలగించుకోవాలని భావించిన... శ్రీలక్ష్మి దంపతులు అతనిపై సుపారీ గ్యాంగుతో హత్యాయత్నం చేశారు. శివారెడ్డి ప్రాణాపాయస్థితిలో చికిత్స పొందుతున్నాడు. అతని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో శ్రీలక్ష్మి దంపతులే.. ఈ హత్యాయత్నానికి కారణంగా గుర్తించారు. దీంతో వారిని అరెస్ట్ చేశారు.

# కాంగ్రెస్‌తో పర్మినెంట్ పెళ్లేమీ కాలేదు!

## : పొత్తుపై అరవింద్ కేజ్రీవాల్ ఆసక్తికర వ్యాఖ్య

**ఆంధ్ర ప్రగతి ఢిల్లీ మే 29:**
కాంగ్రెస్ పార్టీతో పొత్తుపై ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ పొత్తు శాశ్వతం కాదని... లోక్ సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు మాత్రమే తాము ఒక్కటయ్యామన్నారు. బుధవారం 'ఇండియా టుడే' రాజ్ దీప్ సర్దేశాయ్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... జూన్ 4న లోక్ సభ ఎన్నికల ఫలితాల్లో ఇండియా కూటమి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



'ఆమ్ ఆద్మీ పార్టీకి కాంగ్రెస్‌తో పర్మినెంట్ పెళ్లేమీ జరగలేదు. ప్రస్తుతానికి బీజేపీని ఓడించడమే మా లక్ష్యం. ప్రస్తుతం నియంతృత్వం, గూండాగిరిని అంతం చేయడమే మా పాలన లక్ష్యం' అన్నారు. ఢిల్లీలో 7 లోక్ సభ స్థానాల్లోనే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నట్లు తెలిపారు. పంజాబ్‌లో మాత్రం కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రత్యర్థులుగా బరిలోకి దిగాయని గుర్తు చేశారు. పంజాబ్‌లో బీజేపీకి ఎలాగూ మనుగడ లేదన్నారు.మద్యం పాలసీ కేసులోని మనీ లాండరింగ్ వ్యవహారంలో తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసే ప్రసక్తి లేదని కేజ్రీవాల్ పునరుద్ఘాటించారు. అయితే తాను సీఎం పదవికి రాజీనామా చేయాలని బీజేపీ మాత్రమే కోరుకుంటోందన్నారు. బీజేపీ ముచ్చటగా మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తే మాత్రం దేశంలో ప్రముఖ రాజకీయ నేతలంతా జైళ్లలోకి వెళ్లడం ఖాయమన్నారు. ఇంకా చెప్పాలంటే పుతిన్ సారథ్యంలో రష్యాలో పరిస్థితి ఎలా ఉందో.. దాదాపు అదే పరిస్థితి భారత్‌లో వస్తుందన్నారు.తమ పార్టీకి చెందిన నేతలు సత్యేంద్ర జైన్, మనీష్ సిసోడియాలు బీజేపీలో చేరితే వెంటనే బెయిల్ వస్తుందని... బీజేపీ నేతల నుంచి సందేశాలు వెళ్లినట్లు తన వద్ద సమాచారం ఉందన్నారు. స్వాతి మాలివాల్ ఘటనపై స్పందించేందుకు కేజ్రీవాల్ నిరాకరించారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ రాజకీయ జీవితం ముగిసిపోతుందని జోస్యం చెప్పారు. అమిత్ షా ప్రధాని కావడం ఖాయమన్నారు.